శాంతిపుత్ర శతకం

కవి

రమేష్ దాసరి

శాంతిపుత్ర శతకం

కవి : రమేష్ దాసరి

ప్రథమ ముద్రణ : నవంబర్ 2019
ISBN 978-172227997

వెల : రూ.50.00

డి.టి.పి. & ముద్రణ
మెట్రోప్రింటర్స్,
విజయవాడ, సెల్ : 92464 95733

ప్రతులకు
రమేష్ దాసరి
కొండేపాడు గ్రామం,
ప్రతిపాడుమండలం, గుంటూరుజిల్లా
మొబైల్ : 9951854571
E-mail : dasarirameshsadik@gmail.com

శాంతిపుత్ర శతకం

మనసులో మాట

తెలుగు సాహిత్యంలో ఇప్పటి వరకూ ఎన్నో రకాల ప్రక్రియలతో ఎంతో మంది కవులు రచయితలు తమ రచనల చేత సాహిత్య క్షేత్రంలో పూవులు పూయించారు. వారందరి గురించి, వారు సాధించిన ఘన కీర్తిని చదివి, సాహిత్యాభిలాషతో సాహిత్య అధ్యయనం పట్ల ఆసక్తి పెంచుకొని, పరిశోధన స్థాయిలో ఉన్న నేను ఎందుకు రచనలు చేయకూడదు? అనే ఆలోచన కలిగింది. అయితే ఏ ప్రక్రియను ఎంచుకోవాలి? కథ, కవిత్వం, నవల, కావ్యం, శతకం మొ॥వాటిల్లో నాకు ఏది తగినది? అని అనుకున్నప్పుడు పద్య రచనే చేయాలనే ఆలోచనతో శతకాన్ని ఎంచుకున్నాను.

ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నప్పుడు ఎంతో మంది పిల్లలకు చంధస్సును బోధించాను. ఆ లక్షణాలు గుర్తు చేసుకుంటూ రాయడం ప్రారంభించాను. మొదట వృత్త పద్యాలురాయడం తలపెట్టినా యతులు, ప్రాసలు సాధించటం కోసం సంస్కృత పదాలు (తత్సమాలు, తత్భవాలు) ఎక్కువగా వాడాల్సి వస్తుంది. దానివల్ల నా పద్యాలు పండితులకేగాని, పామరులకు, పిల్లలకు అర్థం కావు. ఆబాలగోపాలం చక్కగా చదువుకొని, పాడుకోగలిగేలా ఉండేవి ఆటవెలది పద్యాలు. అందుకే వేమన పద్యాలు అందరినీ ఆకట్టుకుంటాయి. దానికి తోడు నేటి కాలంలో పుస్తకపఠనానికి దూరమవుతున్న పిల్లలు కథలో, నవలలో చదివేందుకు ఆసక్తి చూపడంలేదు. అంత సమయం కూడా కేటాయించడం లేదు. అందుకే చిన్న పదాలతో ఉండే ఆటవెలది పద్యాలయితే పిల్లలుకూడా చదవడానికి ఇబ్బంది పడరని నా అభిప్రాయం. అందుకే దానికి తగినట్లుగా కఠినమైన పదాలుఎక్కువగా వాడకుండాసాధ్యమైనంతవరకు నేటి కాలంలో వాడుకలో ఉన్న పదాలే వాడాను. ఎక్కడైన కొత్త పదాలుగా అనిపిస్తే అవి చిన్న పిల్లలకు పదజాలాభివృద్ధికి దోహదం చేస్తాయని భావిస్తున్నాను.నా ప్రయత్నం పిల్లలను కూడా అలరించాలనే. పిల్లలుగా ఉండగానే వారు నడవవలసిన

మార్గాన్ని వారికి బోధించాలి. మొక్కై వంగనిది మ్రానై వంగదు కదా! అందుకే పిల్లలను ప్రతీవిషయంలో గారాబం చేయకుండా నీతి వాక్యాలు, మంచిని బోధించే పద్యాలు వంటివి చెప్పడం ద్వారా వారిలో మనవత్వపు విలువలు పెంపొందు తాయి. తద్వారా ఉత్తమ పౌరులుగా తయారవుతారు. అందుకే ఇది కొంచెం నీతి, కొంచెం భక్తిని, కొంచెం వైరాగ్యం అన్నీ కలగలసిన శతకం.

అసలు ఈ శాంతి పుత్రుడు అంటే ఎవరనే సందేహం కలుగవచ్చు. ఆయన ఎవరో కాదు జీసెస్ క్రైస్ట్ . ఆ పేరు ఎందుకు ఉపయోగించానంటే ప్రపంచంలో ఎక్కడ చూసినా అల్లర్లు, అరాచకాలు, గొడవలు. ఇన్ని రకాల సమస్యలనడుమ సగటు మానవుడు స్వేచ్ఛగా, ఆరోగ్యకరమైన వాతావరణంలో శాంతియుత జీవనం గడపటం గగనమైపోతుంది. ఎన్నో రకాల సమస్యలతో ప్రతీ ఒక్కరూ ప్రశాంతతను కోల్పోతున్నారు. మనిషికీ మనిషికి మధ్య ,దేశానికి దేశానికి మధ్య ఎన్నో రకాల సంఘర్షణలు. వ్యక్తి స్వార్థం సమాజ స్వార్థంగా పరిణమిస్తున్న తరుణంలో ఒకరంటే మరొకరికి తగని వైరుధ్యం ఏర్పడిపోతుంది. ఎక్కడ చూసినా కుల, వర్గ, వర్ణ విభేదాలతో ప్రపంచమంతా ఘర్షణల మయమైపోతుంది. అందుకే నేడు అందరికీ అందనిది, అందరూ పొందలేనిది శాంతి మాత్రమే.

ఇలాంటి ఎన్నో సంఘర్షణల నుండి, సమస్యల నుండి మనిషికి శాంతి, సమాధానం లభించేది క్రీస్తు ఉపదేశాల వల్లనే. ఆయన ప్రపంచపు శాంతి దూత. ఆయనే శాంత మూర్తి. ఆయన శాంతిని మనప్రపంచానికంతటికీ పంచాడు. ఒకరితో ఒకరు ప్రేమ పూర్వకంగా జీవించే విధానం తెలియజేశారు. ప్రపంచ పౌరులుగా జీవించటం నేర్పాడు. అందుకే ఆయన శాంతి స్థాపన కోసం జన్మించిన కుమారుడు, శాంతిపుత్రుడు. ఈ శాంతియుత జీవనాన్ని క్రీస్తు పూర్వమే మన దేశంలో గౌతమ బుద్ధుడు కూడా బోధించాడు. అంతేకాదు ఆధునిక కాలంలో గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి వారు కూడా సరిహద్దుల మధ్య జీవించే నరుడిలా కాకుండా ప్రపంచ పౌరులుగా జీవించాలని, వసుధైక కుటుంబం సాధించాలని కాంక్షించారు. అప్పుడు అందరిదీ ఒకటే కుటుంబం

అదే ప్రపంచ కుటుంబం అవుతుంది. అయితే ఈనాటి కాలంలో కూడా ప్రజలందరూ శాంతి యుతంగా జీవించాలని ఎవరు కోరుకుంటారో వారు కూడా శాంతి పుత్రులు, పుత్రికలే.

ఈ శతకంలోనిపద్యాలకు వస్తువుని(అంశం) అందించినది బైబిల్ మరియు నేటి సమకాలీన సమాజం .బైబిల్లోని నీతిని, నేడుసమాజంలోతలెత్తుతున్న సమస్యలను మూలంగా తీసుకొని పద్య రచన చేశాను. బైబిల్ ను ఆధారంగా చేసుకున్నా ఇక్కడ చెప్పబడినవి మాత్రం ప్రాపంచిక సత్యాలు. దీని వల్ల నీతితో పాటు భక్తి కూడా పెరుగుతుంది. ఈభావన చిన్న తనం నుండి పిల్లల్లో అలవడితే బాగుంటుంది. దైవం మీద భక్తి శ్రద్ధలున్నవారు తప్పుడు పనులు చేయడానికి భయపడతారు. ఒక మంచి సమాజం ఏర్పడటానికి నా వంతు ప్రయత్నంగా ఇది ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను. పెద్దలు, పండితులు దీనిలో తప్పులను గమనిస్తే నాకు తెలియజేయండి. హృదయ పూర్వకంగా స్వీకరించి సరిచేసు కుంటాను.



రమేష్ దాసరి

తొలిప్రయత్నానికి ఆశీస్సులు

సమాజంలో నైతిక విలువలు పతనమవుతున్న నేటి కాలంలో విలువల స్థాపనకు నా విద్యార్థి (దాసరి రమేష్) పూనుకోవడం ఎంతో ముదావహం. ఆధునిక కాలంలో సమాజంలో విలువలు అంతరించిపోతున్నాయి. దాని ఫలితంగా సమాజంలో చెడుధోరణులు, అవినీతి, విచ్చలవిడితనం, సంఘవ్యతిరేక శక్తులు ప్రభలుతున్నాయి. ఆనాటిసమాజం విలువలతో వర్ధిల్లటానికి కారణం ఒక వేమన, బద్దెన, జంద్యాలపాపయ్యశాస్త్రి, విశ్వనాథసత్యనారాయణ వంటివారు. ఈ ఆధునిక వ్యవస్థలోని అనేక రుగ్మతలను పారద్రోలి నీతివంతమైన సమాజానికి బాటలు వేసేలా పద్య రచనకు పూనుకోవడం సమాజాన్ని సంస్కరించటమే. ఈ శాంతి పుత్రశతకంలోని పద్యాలు అన్నీ భావయుక్తంగా, రాగయుక్తంగాఉన్నాయి. అచ్చమైన అమ్మ భాషలో ఎంతో సరళంగా ఉండి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సైతం చదవడానికి అనువుగా ఉంది.

"శాంతి పుత్ర శతకం" అనే పేరు శతకానికి పెట్టడం కవికి ప్రపంచశాంతి, సౌభ్రాతృత్వం, మానవత్వంపట్ల ఉన్న అవగాహనకు అద్దంపడుతుంది. ఈ శతకం లోని పద్యాలు మానవాళికి నీతిని, దయాగుణాన్ని, ధర్మాన్ని ప్రభోదిస్తాయని చెప్పటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. విశిష్టమైన సాహిత్య ప్రక్రియల్లో పద్యం ఒకటి. పద్యం చంధోబద్ధంగాఉంది. ఇందులోని పద్యాలులయాత్మకంగా, గాన యోగ్యంగా ఉన్నాయి. ధారణకు అనువుగా ఉన్నాయి. ఈ పద్యాలను అందరూ చదివి రసానుభూతిని ఆస్వాదిస్తూ నైతిక విలువలు పెంపొందించు కుంటారని ఆశిస్తున్నాను.

ఈ పద్యాలలో కవి అమ్మ గురించి, రైతుల గురించి, దైవం గురించి మొ॥అన్ని విషయాలు ప్రస్తావించాడు. కావున పాఠకులందరూ మేలిముత్యాల్లాంటి ఈ శతకపద్యాలు చదివి నీతి వంతమైన ఆదర్శ సమాజానికి బాటలు వేస్తారని ఆశిస్తున్నాను. శాంతిపుత్ర శతకం రచించిన చిరంజీవి దాసరి రమేష్ ను నిండు నూరేళ్ళు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదిస్తున్నాను.

బి. వేణుగోపాలరావు

స్కూల్ అసిస్టెంట్,

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,

తిక్కిరెడ్డిపాలెం, గుంటూరు.

ఆచరణాత్మకం

నవయువకుడిగా విద్యార్థి దశలోనే సమాజాన్ని సునిశితంగా పరిశీలించి, ఈ ప్రాయంలో సహజంగా ఉండే దూకుడు కాకుండా, జీవితానుభవాన్ని రంగరించినట్లు మనసులోని భావాన్ని మేళవించి ఎంతో వివేకవంతంగా, హృద్యంగా తన పద్యంలో వెళ్ళడించినారు రమేష్ గారు.

పద్యాలను ఒకటొకటిగా చదువుతుంటే అతని మూర్తిమత్వం ఎంత ప్రేరణాత్మకంగా వికాసవంతమైనదో అర్థమౌతుంది. ఇది చదివిన వారు చదివి, బాగుందని అంతటితో వదలక, దైనందిన జీవితంలో అనునిత్యం మదిలో పెట్టుకొని ఆచరించవలసిన నీతిచంద్రిక వంటిదిఈ శతకరత్నమని నా భావన. నేటితరం తప్పనిసరిగా తెలుసుకుని, ఆలోచించి, ఆచరించదగిన ఈ సబ్జెక్టును ఎన్నుకున్నందుకు శ్రీ రమేష్ గారికి హృదయపూర్వక అభినందనలు.

టి. భూలక్ష్మి

వ్యవస్థాపకురాలు

సరోజినీ విద్యాలయం

పుల్లడిగుంట, గుంటూరు.

1. నరుడు నిప్పు మీద నడచిన యెడలను
కాళ్ళు వేడి వలనకాలునట్లు
పరుల దానికాశపడిన నాశనమౌను
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! నరుడు నిప్పుల మీద నడిస్తే వేడి వలన కాళ్ళు కాలునట్లు మనిషి పరులదాని కొరకు ఆశపడితే నాశనమై పోతారు.

2. మంచి బుద్ధి దయను మరింత పెంచును
చెడ్డ బుద్ధి నరుని చెరచు; నిలను
యట్టి బుద్ధి మనలఁ మంటికి చేర్చును
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర!

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! మంచిబుద్ధి మనిషిలో దయా గుణాన్ని మరింత పెంచుతుంది. చెడు స్వభావం మనిషి నాశనానికి కారణం అవుతుంది. ఈస్వభావం మరణానికి దారితీస్తుంది.

3. జ్ఞాని పెదవి తెలివి మాటలు పలుకును
మూఢ వాక్యములను మూర్ఖుడొసగు
మాటలందుమిగుల మాయలు చూపును
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర!

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! జ్ఞాని ఎప్పుడూ కూడా తెలివిని భోదిస్తాడు. మూర్ఖుడు మాత్రం మూర్ఖంగా తనమాటే నెగ్గాలని కోరుకుంటూ మాయమాటలు, గొప్పలు చెప్పుకుంటాడు.

4. నరుడి నాశ్రయింప నష్టము జేయును
ఱేని నాశ్రయింప రిక్తమౌను
దేవతాశ్రయంబె తీర్చును కోర్కెలు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర!

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! మనుషులను నమ్ముకుంటే నష్టం జరుగుతుంది. రాజులను ఆశ్రయించటం కూడా వృధానే. దైవమే అన్నిటికీ పరిష్కారం చూపుతుంది.

5. భక్తిహీనతున్న భంగపాట్లెదురగున్
మంచితనము వల్ల మనిషి నిత్య
జీవమార్గ మందు జీవులఁనడుపును
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! మనిషిలో భక్తి లోపించినప్పుడు అన్ని తప్పులే కనిపిస్తాయి. నీతితో నడుచుకునే వాడు తన సమూహాన్ని మంచిమార్గంలో నడిపించగలడు.

6. ఖరువునకును చబుకు, ఖరముకు కళ్ళెము
మూర్ఖచిత్త నరుని మూపు మీద
వాతలు సరి, నీతిపరులకు కీర్తియౌ
శాంతినొసగు మయ్య శాంతి పుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! గుఱ్ఱం కళ్ళకు గంత, గాడిదకు కళ్ళెము ఏలాగో మూర్ఖ స్వభావం కల నరుడి వీపుకి దెబ్బలు, నీతి పరులకి కీర్తిసరైనవి.

7. బద్ధకుండు పనిని పాడుచేయుట జూడ
పండ్లయందువగరు వంటిదౌను;
ఉచిత నేత్రములకు ధూమ్రము వంటిది
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! వగరుగా ఉన్న పండును మనం ఎలాగు తినలేమో, మంచిగా ఉన్న కళ్ళలోకి పొగ చేరితే ఎలాగు చూడలేమో అదేవిధంగా బద్ధకస్తుడు కూడా పనిని పాడుచేస్తాడు.

8. కీడు చేయు వాడు కీడునే పొందును
మోసపుచ్చు వాడు మోసమొందు
నీతిమంతుడెల్ల నిత్యము వర్ధిల్లున్
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! ఒకరికి కీడు చేయాలనుకునే వాడు తెలియకుండానే కీడును పొందుతాడు. ఒకరిని మోసం చేయాలనుకునే వాడు ఇతరులచేత మోసపోతాడు. కాని నీతిమంతుడు మాత్రం నిత్యం వర్ధిల్లుతాడు.

9. ఎవ్వరెన్ని జెప్పి రేని మూర్ఖమదకి
ఎవ్విధముగనైన నెరుకగాదు
నిజము; యట్టివారిఁ నిర్జించి జీవించు
శాంతినొసగు మయ్యశాంతి పుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! ఎవరెన్ని రకాలుగా ప్రయత్నించినా మూర్ఖుడికి నిజాలు తెలియజేయలేము. అలాంటివారికి దూరంగా జీవించటమే మేలు.

10. మూఢురాలు తనదు మొగుడికి హేయము
తెలివి కలిగి నడచు తెఅవ యాస్తి
పెంచు; యోగ్యురాలుపెనిమిట బాసికం
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! మూర్ఖురాలు తన భర్తకు అసహ్యాన్ని కలిగిస్తుంది. తెలివి కలిగి నడుచుకునే భార్య భర్తకు ఆస్తి పెంచుతుంది. గుణవంతురాలు భర్తకు తలమానిక మౌతుంది.

11. కులము పేరు చెప్పకుండగ గెల్వడు
నాయకుండు; సార నగదు లేక
వేయరోటుఁ జనులు, విక్రయించును హక్కు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర!

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! ఈదేశంలో రాజకీయ నాయకులు కులము పేరెత్తకుండా ఎన్నికలలో గెలవలేరు. సారా, డబ్బు పుచ్చు కోకుండా ఓటు వేయరు అధములు. తమ హక్కులను అమ్ముకుంటున్నారు.

12. తగవు పెంచు వారు ధరణి నధముడు
మధ్యముండు చూసి మానసించు
తీర్చు నుత్తముండు తెలివిగ యోచించి
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర!

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! ఈ భూమి మీద ఉన్న వారిలో తగువులుపెంచేవారు అధములు, తగువులు చూసి మనసులో ఆనందపడే వారు మధ్యములు, సమస్య తెలుసుకుని తెలివిగా పరిష్కరించే వారు ఉత్తములనిపించుకుంటారు.

13. కూట సాక్షి పలుకు కుట్ర పూరితముగ
సత్యవాది పలుకు శాంతి మాట,
జ్ఞాన వచన మైన మంచి చేయును గదా
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర!

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! అబద్ధాలు చెప్పే వాడు కుట్రలతో ఎన్ని అబద్ధాలనైనా చెప్తాడు. నిజము చెప్పేవారు ఎప్పుడూ శాంతియతమైన మాటలే పలుకుతారు. మన మేలు కోరి పలికేవన్ని జ్ఞాన వచనాలే కదా!

14. జిహ్వా తనువు నందు చేరిన పాపపు
కూపమంద్రు; నరక కూపమిచ్చు
అగ్నికణము చెలగి యడవి గాల్చినయట్లు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర!

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! నాలుక శరీర మంతటిలో పాపహేతువు వంటిది. అది నరకానికి దారి తీస్తుంది. అగ్నికణము చిన్నదైనా, పెరిగి దావాగ్నిగా మారి అడవినే దహిస్తుంది కదా!

15. పరమ లోభి యైన వణిజుని కంటెను
సాయమొసగు చిన్న శయము మేలు
దాహమందు నెయ్యి దప్పిక తీర్చునా
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! పరమలోభి అయిన వ్యాపారస్తుడి కంటే సాయం చేసే గుణమున్న చిన్నవారి చేతులు మేలైనవి. దాహం వేసినప్పుడు కడవెడు నేయి తాగినా తీరదు. కాని గ్లాసుడు నీరు చాలు కదా!

16. వికృత రూప శిలలు వెలుగొందు దేవతై
సకల పూజ చేయుఁ జనుల భక్తి
వికృతరూపుఁ బుట్టు బిడ్డడు దోషమా
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! ఈలోకంలో రకరకాల ఆకృతులను దేతలుగా చేసి ప్రజలు పూజిస్తుంటారు. కాని అదే వికృతంగా పిల్లలు పుడితే అవమానంగా భావించి పారవేస్తారు.

17. నేల కలుషితంబె నిస్సారత వలన
నింగిఁ గూడ చెరచె నీచ గాడ్పు
మానవతనువీడి మనిషి మలినుడాయే
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! నేల సారం కోల్పోయి కలుషితంగా మారిపోతుంది. ఆకాశం కూడా కలుషిత వాయువులతో పాడైపోతుంది. మానవత్వాన్ని విడిచిపెట్టి మనిషి కూడా పాడైపోతున్నాడు.

18. పేదవాడి వనుచు భేదము చూపకు
కులముపేర జనులఁ ద్రోల వద్దు
ధనికుడైన నరుడు దరిచేరునా దివి
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! పేదవాడివని భేద భావాలు చూపించటం తప్పు, కులం పేరుతో జనులను దూరంగా ఉండ కూడదు. డబ్బు, దర్పం ఉన్నంత మాత్రాన స్వర్గలోకంలో చేరలేరు కదా!

19. మేలిమైన పసిడి నిగిడించు కన్నను
విలువ కలిగినట్టి వెండి కన్న
మంచిపేరు,దయయు నాణ్యమైనవి కావ?
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! మంచి బంగారాన్ని, విలువైన వెండిని సంపాదించటం కంటే మంచిపేరు, దయ సంపాదించటం చాలా మేలు

20. వస్త్రధారణ చూసి వైనము జూపకు
తపసి జనులు చూడ దాల్చుఁ బూది
అరసుకూడా మొక్కునట్టిసాధువులకు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతి స్థాపనకోసం జన్మించిన కుమారా! వస్త్రాలంకరణ చూసి మనిషికి గౌరవమివ్వటం సబబుగాదు. సాధువులైన వారు బూడిదను ధరిస్తారు. కాని వారు రాజులచేత కూడా గౌరవించబడతారు.

21. కలువ పూలు కనుల కనువిందు జేయును
చంద్రకాంతి భూమిఁ జల్లజేయుఁ
నీతి పరుడొసగును నీతియు, ధర్మంబు
శాంతినొసగు మయ్యశాంతి పుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! కలువలు కంటికి చాలా అందంగా కనిపిస్తాయి. చంద్రుని కాంతి భూమిని చల్లబరుస్తుంది. అదే విధంగా నీతిమంతుడు నీతిని, ధర్మాన్ని వ్యాప్తిచేస్తాడు.

22. ప్రేమ కోరు నోర్పు,పేరిమి యెరుగదు
మత్సరంబు; చూపుఁ మంచి కరుణఁ
ప్రేమనిలుచు నోయి పృథ్విలో నిరతము
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచశాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! ప్రేమ సహనాన్ని కోరుతుంది. ప్రేమకు మత్సరము తెలియదు. ప్రేమ కరుణ చూపిస్తుంది. ఈ భూమి మీద చివరి వరకు నిలిచేది ప్రేమయే.

23. దుష్ట జనుల వోలె దుర్బుద్ధి చేయకు
పాపులైన వారి బాట వద్దు
మంచి మార్గమెంచి మసలుకో నీతితో
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! చెడ్డవారి వలె దుష్టమైన ఆలోచనలు చేయకూడదు. పాపాత్ములైన వారి మార్గంలో నడవవద్దు. మంచి మార్గమేదో తెలుసుకుని నీతిగా జీవించు.

24. వెండి యందు మష్టు వెలికికి తెచ్చిన
పుటము వేసి రూపు పొందునట్లు
కుటిల బంట్లు లేని గుటికాడి పాలనౌ
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! వెండిలో నుండి మట్టి బయటకు తీసి, పుటమువేసి మంచి ఆకారం ఇస్తేనే దానికి విలువ కలుగుతుంది. అదేవిధంగా పాలకుల వద్ద కుటిల స్వభావం గల సేవకులను తొలగిస్తేనే పాలన సవ్యంగా ఉంటుంది.

25. ఆత్మహత్య శరణమనుచు చావగనేల?
చావ ధైర్యముంటె జడ్డు నెదురు
చచ్చినీవు యిలను సాధించునదియేమి
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! కష్టాలకు భయపడి ఆత్మహత్య శరణమని చచ్చిపోతారెందుకు? చచ్చే ధైర్యముంటే కష్టాల నెదిరించు. చచ్చి భూమి మీద సాధించేదేముంది.

26. నాయకుండు మంచి నడవడి జూపగా
అనుసరించుc జనము యట్టి విధిని
వెలుగుతున్న దివ్వె వెలిగించుc దివ్వెలన్
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! నాయకుడు మంచి ప్రవర్తన కలిగి ఉంటే అతని జనము కూడా దానినే అనుసరిస్తారు. వెలుగుతున్న చిన్న దీపం అనేక దీపాలను వెలిగించగలుగుతుంది కదా!

27. నీతి జనులు ఘనత నెక్కుట తథ్యము
పాపులైన జనులు బడయును యపకీర్తి
నిత్య సత్యమేగ నీతితో మెలుగుము
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! నీతిగా నడుచుకునే వారు ఎప్పటికైనా ఘనత సాధిస్తారు. పాపాత్ములు కూడా అపకీర్తి పొందుతారు. ఇది నిజము. కాబట్టి నీతిగా నడుచుకోవాలి.

28. బాల్యమందు వన్నె పసికందు యల్లరి
పడుచుదనము నందు వపువు శోభ
ముదిమి నందు సొబగు ముదిత పలితములు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! బాల్యంలో చిన్నపిల్లల అల్లరి అందం. యవ్వనంలో శరీరాకృతి అందం. ముసలితనం లోని వారికి తెల్లని వెంట్రుకలు అందం.

29. ఎంత కలిగెనేమి సంతసింపనివివె
కాలుచున్నయగ్ని, నీళ్ళుచేత
నింపలేని నేల, నిండని నరకము
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! ఎంత ఇచ్చినా సంతృప్తి పొందనివి లోకంలో ఇవే. మండుచున్న అగ్ని, ఎన్నివర్షాలు కురిసినా నిండని నేల, ఎంతమంది చేరినా నిండని నరకము. వీటికి తృప్తిలేదు.

30. మితముగ వచియింప నిచ్చును తెలివిని
మూఢుడైన వాడు నొందుఁ కీడు
శాంతగుణము యిచ్చు సకల వివేకము
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! తక్కువగా మాట్లాడటం తెలివైనపని. మూర్ఖుడు అతిగా మాట్లాడి కీడు కొని తెచ్చు కుంటాడు. శాంతముగా నుండిన చాలావివేకము.

31. అమ్మమాట బిడ్డ కాయుష్షునిచ్చును
జనని లేత చూపు జయము నిచ్చు
తెలిసి గౌరవించు తల్లిని నిత్యము
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! తల్లి ప్రేమతో పలికే మాటలు బిడ్డలకు దీర్ఘాయువునియ్యుంది. తల్లిచల్లని చూపు పిల్లలకు మంచి విజయాలనిస్తుంది. అమ్మకు కోపం తెప్పించరాదు. అలాంటి తల్లి గొప్పదనాన్ని గ్రహించి గౌరవించాలి.

32.. బీదరికము నందు నుద్గతి చెడుగాదు
గొప్ప యింట పుట్టి గుణము చెడితె?
జన్మ హేతువెంచి జగమందు గెలువుము
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! పేదరికంలో పుట్టినందుకు బాధపడకూడదు. గొప్ప వంశంలో పుట్టినా స్వభావం చెడిపోతే ఏం ప్రయోజనం? మనం పుట్టుకవల్ల ఉపయోగం ఏమిటో తెలుసుకొని, సార్ధకత చేకూర్చాలి. అదే జీవిత పరమార్ధం.

33. కష్టమందు నరుని కరుణించు ప్రేమతో
శత్రువైన తగిన సాయమివ్వు
పుచ్చుకొనుటకన్న యిచ్చుటమేలుగా
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! కష్టాలలో ఉన్నవారిని ప్రేమతో కరుణించాలి. అది శత్రువైనా సరే తగిన సాయంచేసి పంపాలి. పుచ్చుకోవటం కంటే ఇవ్వటమే చాలా గొప్పది కదా.

34. తప్పు చేయు వాడు తన తప్పు దాచును
యెవరు తనను చూడ లేదనుకొని,
తప్పు తేటమగును తగు కాల మందును
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! తప్పు చేసేవాడు తన తప్పులను ఎవరూ చూడట్లేదు కదా అని కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తాడు. కాని తప్పు ఎప్పటికైనా బయటపడకమానదు.

35. రైతుమిన్న సకల రంగములందును
రైతులేని దేశం లయము చెందు
రైతు విలువ నెరిగి రాజిల్లు నిత్యము
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! అన్నిరంగాలతో పోల్చుకుంటే రైతు చాలా గొప్ప. ఏదేశంలో రైతు ఉండడో ఆదేశం నాశన మౌతుంది రైతు విలువ తెలిస్తేనే ఘనత లభిస్తుంది.

36. ఆస్తి పరుడనగుట కాసన్నమనుచును
పంట పండు భూమిఁ బాడు చేయ
కూడు లేకపోతె కూర్మిని తిందువా
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! నాగరికత అని, ధనము సంపాదించాలని పంట పండే భూములను పాడు చేసి భవనాలు కడితే ఎలా? తిండి లేకపోతే డబ్బును తినగలరా?

37. ఇనుపకత్తి పదును యీడేర్చు కార్యము
పదును లేని యెడల బలము లేమి
జ్ఞాన వృద్ధి చేసి ఘనతను పొందుము
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! ఇనుపకత్తి పదునుగా ఉంటేనే మొద్దులను నరకగలదు. పదును లేకపోతే మన బలం తగ్గుతుంది. అదేవిధంగా జ్ఞానాన్ని కూడా వృద్ధి చేసుకంటూ పనులన్ని సఫలం చేసుకోవాలి.

38. తనువు నందువిషము,తలపెల్ల కుట్రలు
పనులుచూడ మాయ,పలుకు కల్ల
కుత్సితుండు బుద్ధి గుర్తించి మెలగుము
శాంతినొసగుమయ్య శాంతి పుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! చెడ్డవాడికి ఒళ్ళంతా విషం, ఆలోచనలన్ని కుట్రలు, చేసే పనులు కూడా మాయ. మాటల్లో కల్మషం ఉంటుంది. అలాంటి వారిని గమనించి మెలగాలి.

39. బీద జనులఁ మిగుల బాధకు గురిచేయ
వృద్ధజనులఁ గొట్టి విలువ తీయ
గొప్పకాదు నరుడ గుణహీనమొందును
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! నరులు పేదవారిని హింసించటం, వృద్ధులను కొట్టడం, పరువు తీయటం వంటివి చేస్తూ అదే గొప్ప అనుకుంటున్నారు. ఇలాంటివి గుణహీనతకు కారణం అవుతాయి.

40. దైవమొకని ధనము,ధాన్యము,ఘనతను
కోరుకొనిన దాన్ని కొదువ లేక
యిచ్చెనైనతృప్తి లేక వృధానేగ
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! దైవం ఎవరికైనా ధనము, ధాన్యము, ఘనత వంటివి విపరీతంగా ఇచ్చినావారికి తృప్తి లేకపోతే అదంతా వృధానే కదా!

41. ముందు చూపు లేక మోసపోవును జీవి
కార్యమందు తెలివి కలిగి యున్న
సఫలమొసగు నీకు సర్వ కార్యములును
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! మనిషికి ముందు చూపు చాలా అవసరం. చేసే పనిలో తెలవి కలిగి ఉండాలి.అలా ఉంటే ఏపనైనా సఫలమౌతుంది.

42. మనిషి మరణమైన నష్టము స్వల్పము
చెట్టు మరణమైన చేటు నిచ్చు
చెట్లు పెరిగితేనె జీవితం నరుడికి
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! మనిషి చనిపోతే కుటుంబం మాత్రమే నష్టపోతుంది. చెట్టు మరణిస్తే పర్యావరణం మొత్తం దెబ్బతింటుంది. చెట్లు ఉంటేనే మనిషికి జీవితం.

43. తర్కమిచ్చు నీకు తగినట్టి జ్ఞానము
భక్తి యిచ్చు నీకు ముక్తి మార్గం
రెండు కూడ నీలో మెండుగా జేసుకో
శాంతినొసగు మయ్య శాంతి పుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! తర్కించుట వలన మనిషికి జ్ఞానం వస్తుంది. భక్తివలన వినయంతో కూడిన మంచి మనసు లభిస్తుంది. ఈ రెండింటి మనలో ఎక్కువగా పెంచుకోవాలి.

44. సంశయములు వీడి సర్వ కార్యము చేయి
మంచి మనసు కార్య మంత నిలుపు
రత్నగర్భ నందు రాజిలు జ్యోతివై
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! అనుమానాలు లేకుండా పనులు చేయాలి. చేసేపనిని మంచి మనసుతో చేయాలి. అలా చేస్తే లోకంలో ఒక జ్యోతిలా వెలగ గలవు.

45. మత్తు నందు జగము మసలుతూ నుండిన
యిల్లు గుల్ల కాగ యీసడింపుఁ
మత్తువలన మనిషి మర్యాద పోవురా
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! లోకంలో ఎక్కువ మంది మత్తులో జీవస్తున్నారు. దాని వల్ల ఇల్లు గుల్లై , అందరూ ఈసడించు కుంటారు. మత్తు వలన మనిషికి మర్యాదపోతుంది.

46. తప్పిదంబు నెరిగి తడయకంగికరించు
కసరు గొనకు, తగదు గర్వ పలుకు
మంచి చెడు భేదమెంచి గౌరవమొందు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! చేసిన తప్పును తెలుసుకుని ఆలస్యం చేయకుండా ఒప్పుకోవాలి. కోపాన్ని అణచుకోవాలి. గర్వంగా మాట్లాడటం తగదు. మంచి చెడు వివేచిస్తేనే మనిషికి గౌరవం.

47. పొగరుబోతు తనము పోరు కీడ్చు నిరతం
వదరుబోతు మైత్రి పాడు చేయుఁ
మంచితనము మనిషి మర్యాద పెంచును
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపనకోసం జన్మించిన కుమారా! పొగరుబోతు తనం అనేది తగాదాలకు దారితీస్తుంది. వదరుగా మాట్లాడటం వల్ల స్నేహం చెడుతుంది. అదే మంచితనంగా ఉంటే మనిషికి మర్యాద పెరుగుతుంది.

48. చెడును చూడకుండ చూడు నీ కళ్ళను
చెడును వినికి తేక చెవులు కట్టు
చెడును పలుకకుండ జిహ్వా నెడము జేయి
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! చెడును చూడ కుండా కళ్ళు, చెడును వినకుండా చెవులను, చెడ్డమాటలు పలుకకుండా నాలకలను దూరంగా ఉంచాలి.

49. పౌరుడు లోకమునకు పటువుగా మెలగాలి
ఉప్పు వలన వంటరుచిని పొందుఁ
ఉప్పు సారమిడిన నుపయోగముకు రాదు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! ఉప్పు వలన వంటకు రుచి వస్తుంది. ఉప్పు సారం కోల్పోతే వ్యర్థమౌతుంది. అదేవిధంగా మనిషి కూడా లోకమునకు ఉప్పుగా మెలగాలి.

50. కొండమీద నుండు కొంప మరుగు కాదు
కంటిచూపు మేర కనబడునుగ
మనిషి మంచితనము నడతలో కనిపించు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! ఎత్తైనకొండమీద నుండే ఇల్లు కనుచూపు మేరలో అందరికీ కనిపిస్తుంది. అదేవిధంగా మనిషి మంచితనము కూడా వాని ప్రవర్తనలో స్పష్టంగా కనిపిస్తుంది.

51. మంచితనము చూడ కొంచెమైనను లేక
మనిషినన్న మాట మరచి బ్రతికి
మానవత్వమునకు మనిషి దూరము నొందె
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! మనిషి మంచి తనము కొంచెం కూడా లేకుండా తానూ ఒక మనిషిననే విషయం మరచిపోయి బ్రతుకుతున్నాడు. చివరికి మానవత్వానికి దూరమయ్యాడు.

52. పలు విధంబులైన బలియర్పణము,పూజ
దైవమెన్నడైన త్రాణ లేదు
ఆయనిచ్చుయాజ్ఞ పాలనే శ్రేష్టము
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! రకరకాల బలులు, అర్పణలు, పూజలు దేవుడుకోరటం లేదు. ఆయన భోదించు ఆజ్ఞలను పాటించటమే శ్రేష్టం.

53. మార్పు వచ్చుటంటె మందమగుట కాదు
అప్పులు విడచుటయు, యాస్తిగాదు
పాపబ్రతుకు విడిచి పరిశుద్ధమొందుటే
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! మార్పురావటం అంటే లావు పెరగటం కాదు. పేదరికం పోవడం, ధనవంతుడవగుట కూడా కాదు. పాపము విడిచి పరిశుద్ధంగా జీవించటమేకదా.

54. డాంబికుండు కన్న టక్కరి కన్నను
వన్నెకారి కన్న, పాపికన్న
ఎల్లవారికన్న మేలు యదార్థుండు
శాంతినొసగుమయ్య శాంతి పుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! డాంబికాలు పలికే వారికన్న, టక్కరికన్న, సంపదలను చూసుకుని మురిసేవాడికన్న, పాపాత్ముడు కన్న ఎలాంటి వారికన్న యదార్థంగా ప్రవర్తించేవారే గొప్ప.

55. కలిమితోటెవచ్చుఁ గష్టముల వరుస
అవసరముకు చాలినంత మేలు
సంపదెంతయున్నసంకులు తీరవు
శాంతినొసగుమయ్య శాంతి పుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! మనకు కలిగే సంపదతోటే కష్టాలు కూడా వస్తాయి.మన అవసరాలకు తగినంత ఉంటే చాలా మేలు. సంపద ఎంత ఉన్నా చిక్కులు తీరవుకదా.

56. తప్పు చేయువారిఁ దండించగవలదు
తప్పు చేయకుండదారి చూపు
పాపమెరుగనట్టి ప్రాణిలోకము నుంద?
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! తప్పు చేసే వారిని ముందుగా దండించకూడదు. ఆతప్పులు మరల చేయకుండా దారి చూపించాలి. ఎందుకంటే లోకంలో పాపములు చేయనివారెవరు?

57. ఒరులఁ జూచి సణగునొంద సబబు కాదు
సాత్వికమును పంచి శమము గాయు
మరణమొందు వరకు మత్సరపడకుము
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! ఇతరులను చూసి సణగుకోవటం సబబుకాదు. సాత్వికాన్ని పంచి, శాంతిని రక్షించు. చచ్చేంత వరకు మచ్చలేని వారిగా నీతిగా నడచుకోవాలి.

58. చిన్నలైన వారి జన్మదినము కన్న
పెళ్లిరోజు నాటి విందు కన్న
స్మరణంబు మేలునిర్యాణపు దినము
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! చిన్నపిల్లల జన్మదినాల కన్న, పెళ్ళిరోజునాటి విందులుకన్న మరణించినవారి నిస్మరించ కోవటం మంచిది.

59. పుట్టినట్టి ప్రాణి పోవక తప్పదు
వస్తువైన చూడ పాతగిలును
మంచిమాట యిలను మరణమవ్వదు కదా!
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! పుట్టినవారు చనిపోకతప్పదు. విలువైన వస్తువైనా సరే పాతబడుతుంది. కాని మంచి మాటకు భూమి మీద అంతం ఉండదు. అది చిరకాలం నిలుస్తుంది.

60. మంచి మాటలెల్ల నందరూవిందురు
ఆచరించు వారునల్పులైరి
మంచినను సరించిమనిషిగా వర్ధిల్లు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! మంచిమాటలు అందరూ వింటారు. కాని పాటించే వారు కొద్దిమందే. మంచిననుసరించి జీవిస్తే మనిషిగా వర్ధిల్లుతారు .

61. ఆత్మ బంధువైన అపర మిత్రుడైన
పరుల కొరకు తనదు ప్రాణమివ్వ
సాహసింపలేరు; సాధ్యమే క్రీస్తుకి
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! ఆత్మబంధువైన అపరమిత్రుడైన ఇతరులకోసం తన ప్రాణాన్ని ఇవ్వడానికి సిద్ధపడలేరు. కాని క్రీస్తుకు ఇదిసాధ్యమే.

62. సంతసించు మనసు ఛాయనిచ్చుఁ మొగము
బాధ చేత తనువు బక్క చిక్కు
కష్టముండబోదు కలకాలమందును
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! సంతోషంగా ఉంటే ముఖం కాంతివంతంగా ఉంటుంది. దు:ఖపడటం వల్ల శరీరం బలహీన పడిపోతుంది. కష్టాలెప్పుడూ కలకాలం ఉండవుకదా!

63. చీమ జట్టుకూర్చి చిరముగా పనిచేయు
నృపుడు లేని మిడుత గుంపు గూర్చు
కలసి కట్టుగుంటె కార్యము నెరవేరు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! చీమలు చిన్నజీవులే అయినా జట్టుగా పనిచేస్తాయి. మిడుతలకు నాయకుడు లేకపోయినా గుంపుగా ఉంటాయి. ఏదైనాసరే కలసికట్టుగా ఉంటేనే పనులు నెరవేరుతాయి.

64. కష్టజీవులు తమ కాయకష్టము చేసి
కూర్చు కొన్నదియును కొద్దిగైన
సుఖమునిచ్చు నిద్ర సకలమనుభవించుఁ
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! శారీరక కష్టం చేసుకుని బ్రతికే కష్టజీవులు తాము సంపాదించుకున్న కొద్ది పాటి తోనే తిని, జీవితాంతం సుఖంగా నిద్రపోగలరు.

65. నదుల జలములెన్ని నాళ్ళు కలిసినా
జలధినందు నుప్పు చవి తరగదు
మంచిమాట వలన మందుడు మారునా
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! నదులోని నీరు చాలా సంవత్సరాల నుండి సముద్రంలోకలుస్తున్నా దానిలోని ఉప్పురుచి తగ్గదు. అదేవిధంగా మూర్ఖుడికి ఎంత హితవు పలికినా మార్పురాదు.

66. సర్వ జీవరాశి సౌందర్యమంతయు
గడ్డిపూవు వలెను క్రల్లవడును
చక్కదనము కాదు చరితమెరుంగుము
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా !సమస్త జీవాలకు ఉన్న అందం ఏదో ఒకనాటికి గడ్డిపూవు లాగా తగ్గిపోకమానదు. కాబట్టి రూపం కాదు చూడాల్సింది దాని స్వభావాన్ని చూడాలి.

67. భంగపాటు ముందు పొగరుబోతుగ నుండు
ఘనత నొంద ముందు కష్టముండు
పనినిబట్టి మనకు ఫలము లభించును
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! మనిషికి భంగపాటు కలుగటానికి ముందు పొగరుబోతుగా కనిపిస్తాడు. ఘనత సంపాదించాలంటే ముందు కష్టపడాలి. చేసే పనినిబట్టి మనకు ఫలితం లభిస్తుంది.

68. గౌరవించగాను గర్వమునొందకు
గౌరవించబడుటకన్న మిన్న
గౌరవమొసగుటయె ఖ్యాతిని పెంచును
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! ఎదుటివారు గౌరవిస్తున్నారు కదా అనిగర్వంతెచ్చుకోకు. గౌరవం పొందటం కంటేగౌరవం ఇవ్వటంవల్ల మనకీర్తి పెరుగుతుంది.

69. అహముతోటి కార్యమారంబముగ జేసి
అవకతవకలైన యాపివేయుఁ
ఎంత కార్యమైన శాంతముగ మడయు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! అహంకారంతో ఏదైనా పని ప్రారంభించినా అవకతవకలు ఎదురైతే మధ్యలోనే ఆపివేస్తారు. కాబట్టి ఎంతపనినైనా శాంతంగా ఆలోచించి చేయాలి.

70. దీపము వెలుగివ్వఁ దివెకంబమున నుంచు
దివ్వెఁ దాయుటెల్ల తెలివి లేమి
మర్మమెప్పుడైన మరుగుచేయకుము
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! దీపం వెలుగు కనిపించాలంటే దీపస్తంభం మీద ఉంచాలి. దీపాన్ని దాచిపెట్టడం అనేది తెలివి తక్కువపని. అదేవిధంగా గొప్ప విషయాలను పంచుకోవాలికాని దాచిపెట్టకూడదు.

71. నమ్మకముగ పనిని నడిపించు వానికి
పెక్కు కార్యమందు పెత్తనమగుఁ
నమ్మువారినెల్ల మభ్యపెట్ట నరకం
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా ! నమ్మకంగా పనిచేసే వారికి అనేక కార్యములకు అధికారిగా నియమించ బడతాడు. కాని నమ్మిన వారిని మోసం చేస్తే నరకము తప్పదు.

72. వాయు గమనమెరిగి వ్యవసాయం జేయి
నీరుదాల్పునెరిగి పైరు కోయి
మాట తీరు యెరిగి మనిషితో మెలగుము
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! గాలి గమన దిశను బట్టి వ్యవసాయం ప్రారంభించాలి. మేఘాలను చూసిపైరు కోయాలి. మాట్లాడే తీరును చూసి స్నేహం చేయాలి.

73. శక్తి కంటె జ్ఞాన యుక్తి శ్రేష్టమె గాని
లేని వాడి తెలివిపనికి రాదు
స్వార్ధపరుని మాట సర్వకాలము జెల్లు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! శక్తికన్న జ్ఞానము శ్రేష్టమైనదే కాని పేదవారి తెలివిపనికిరాదు. ఈకాలంలో స్వార్థపరుడి మాటలే అందరూ నమ్ముతారు.

74. మూర్ఖుడైన యట్టిముసలి రాజుల కన్న
జ్ఞానవంతుడైన పిన్న మేటి
వాడు చెరలొనున్న ప్రభువై పాలించు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! మూర్ఖ స్వభావం ఉన్న ముసలిరాజుకన్న జ్ఞానం కలిగిన చిన్నవాడు మేలు. వాడుచెఱలో ఉన్నా ఏదో ఒకనాటికి ప్రభువై రాజ్యపాలన చేస్తాడు.

75. ధనికుడైనవాడు దైవరాజ్యమునందు
చేరుటెన్నడైన జరుగుటంటె
సూది బెజ్జమందు రదిదూరు భంగిని
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! ధనవంతుడైన వాడు దేవుని రాజ్యంలో చేరడం జరగదు. అలాంటిది సూదిబెజ్జంలో ఒంటె దూరటంతో సమానం.

76. వ్యసనపరులు మిత్రవళి నందు నుండిన
సకల కీడు మనకు సంభవించు
మంచి వైరి యున్న మనకు మేలు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! వ్యసనపరులు మన స్నేహితుల్లో ఉంటే సకల నష్టాలు మనలను చేరుతాయి. దాని కన్న మంచి వాడైన విరోధి ఉన్నా చాలా మేలు చేస్తాడు.

77. పనికిమాలినట్టి పాట వినుట కన్న
పాప భరితమైనపలుకు కన్న
బుద్ధిమంతుడొసగు గద్దింపు మేలురా
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! పాపభరితమైన మాటలు మాట్లాడటం, పనికి మాలిన పాటలు వినటంకన్న బుద్ధిమంతుడు చేసే గద్దింపు చాలా మేలు.

78. మంచి పంటనందు పిచ్చి మొక్కలు వచ్చి
పంట వృద్ధి లేకపాడు చేయుఁ
మంచి జనుల మధ్య మాంద్యులు యట్లగున్
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! మంచి పంటలో పిచ్చి మొక్కలు వస్తే పంట వృద్ధి కోల్పోయి, పాడైపోతుంది. అదేవిధంగా మంచివాళ్ళ నడుమ బుద్ధిలేని వాడు రావటం కూడా అలాంటిదే.

79. పగతుడింట కూడి పంచ భక్ష్యములును
ఆరగింపగాను యాపదౌను
అరులువున్నచోట యూరుబిండిమేలు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! శత్రువు ఇంట్లో పంచభక్ష్యాలు తినటం ఆపదతెస్తుంది. కాని ప్రేమ ఉన్నచోట పచ్చడి మెతుకులు చాలామేలు కదా.

80. గగనమున్న యెత్తు గణుతి చేయ తగునా!
మిట్ట పల్లమున్న మెయిని లోతు
ఱేడు యోచనెంచ కడు దుర్భలములౌను
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! ఆకాశం ఎత్తును కొలవటం, ఎత్తుపల్లాలున్న భూమిలోతును ఖచ్చితంగా కొలవటం ఎంత కష్టమో రాజుల మనస్సులోని ఆలోచనలనుగ్రహించటం కూడా అంతే కష్టం.

81. గర్వమొంద నరుడు గాఢి తప్పి నశించుఁ
కల్ల బ్రతుకులందు కంటి యాశ
మంచినాశ్రయింప మనసున నెమ్మది
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! గర్వం వలన మనిషి గాఢి తప్పి నశించిపోతాడు. మోసకరమైన జీవితమే మనిషి కంటికి ఇంపుగా కనిపిస్తుంది. కాని మంచిని ఆశ్రయిస్తే మనసులో ప్రశాంతత లభిస్తుంది.

82. పట్టపగలు కాంతి ప్రసరించునట్లును
నీతివర్తనుండు నిలిచియుండుఁ
కుటిలుడుండు ప్రొద్దుకుంకు కాంతి వలెను
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! పట్టపగలు కాంతి ఏవిధంగా ప్రసరిస్తుందో నీతిమంతుడు అలా నిలిచి ఉంటాడు. కుటిలమైన స్వభావం కలవాడు సూర్యాస్తమయ సమయంలో కాంతి తగ్గినట్లుగా క్షీణించి పోతాడు.

83. సొంతదైన యాస్తి కొంతయున్నను మేలు
పరులదాని కాశ పడుట తప్పు
తెలిసిమసలు కొనుము తెలివితో నిరతము
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! మనది అనుకునే ఆస్తి కొంచెమున్నా చాలు. ఇతరులది ఏదైనాసరే మనకు మేలుకాదు. దానిని ఆశింప కూడదు. ఇలాంటి విషయాల్లో ఎప్పుడూ తెలివిగా నడుచుకోవాలి.

84. ఱాతి నందు లేడు రక్షకుండెన్నడు
ఱాతిపూజ యిచ్చు ఱాతి గుండె
నిజదైవమిచ్చు నిత్యజీవపు ఊట
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! ఱాతి విగ్రహాలలో లేడు దేవుడు. రాళ్ళను పూజిస్తే మన మనసు కూడా కఠినమవుతుంది. నిజమైన దైవము మనిషికి నిత్యజీవాన్నిస్తుంది.

85. రౌద్రమొందగాను రణములు జరుగును
దుష్ట జనుని వలన దౌష్ట్యమౌను
మంచి వారి వలన మహివర్ధిల్లునురా!
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! రౌద్రం వలన యుద్ధాలు కలుగుతాయి. దుష్టజనుల వలన పాపంపుడుతుంది. కాని మంచి వారి వలన భూమి వర్ధిల్లుతుంది.

86. మరణ పాశములను మమ్ముఁ జేరవు
బాష్పములను కట్టి బాగు చేయు,
పాపబంధకములు బాపెడి దైవమా
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! మరణించే స్థితిలో నుండి ప్రాణాన్ని కాపాడేవాడవు, కన్నీరు తుడిచి బాగుచేసేవాడవు, పాప బంధకాల నుండి విడిపించే దేవుడవు నీవే మాకు శాంతిని దయచేయుము.

87. కలిమి యున్న వాడు గర్వము పొందును
తెలివియున్నవాడు ధనము పొందుఁ
నీతిమంతుడొందుఁ నలుగురు మనుషులన్
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! సంపద ఉన్నవారు గర్వాన్ని పొందుతారు. తెలివి కలిగిన వాడికి ధనము లభిస్తుంది. నీతిమంతుడు మాత్రం నలుగురు మనుషులను సంపాదిస్తాడు.

88. జ్ఞానమున్న వానిఁ మేలుకై గద్దింప
జ్ఞాన వృద్ధి కొరకు నడుము కట్టుఁ
మూర్ఖచిత్తుడెపుడు ముంగోపిగా నుండు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! జ్ఞానవంతుడిని మేలుకోరి ఒకసారి గద్దించిన యెడల మరింత జ్ఞానార్జనకు ప్రయత్నిస్తాడు. మూర్ఖుడు ఎప్పుడూ కూడా ముంగోపిగా ఉంటూ చెప్పేది వినిపించుకోడు.

89. దొంగిలించినట్టి తోయము రుచినిచ్చు
చాటునారగించు చల్ది రుచియు
చాటుమాట వినుట జవము కుత్సితుడికి
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! చెడ్డవారికి దొంగిలించిన నీళ్లు తీయగాను, చాటుగా తినేతిండి రుచిగాను ఉంటుంది. చాటుమాటుగా వినే మాటలు వారికి బలాన్ని ఇస్తాయి.

90. ఎడవు నేల నందు నడవి పెంచగవచ్చు
తీపి చేయవచ్చు తిమి జలములు
మార్చలేము మూర్ఖమదిని కష్టము చేసి
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! ప్రయత్నిస్తే ఎడారినేలలో అడవి పెంచవచ్చు. సముద్ర జలాలను తీపిగా చేయవచ్చు. కాని మూర్ఖుడి మనసును మాత్రం ఎంత కష్టపడినా మార్చలేము.

91. కాలకుండ నిప్పు కణములుండ తగునా?
బట్టనందు నీళ్ళు మూటకౌన?
నిజముదాయగాను ప్రజలకు సాధ్యమా?
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! పిడికిలితో గాలిని బంధించటం సాధ్యమా? బట్టలందు నీటిని మూటగట్టగలమా? అదేవిధంగా నిజాన్ని దాచిపెట్టడం కూడా మనుషులకు సాధ్యంకాదు.

92. బాల్యమందు తగిన పద్దతి నేర్పిన
పెద్దరికము నందునుద్దరించుఁ
మంచి మాటనెంచి మరువక ధ్యానింపు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! చిన్నతనంలోనే పిల్లలకు తగిన పద్దతి నేర్పిస్తే పెద్దయ్యాక దానినుండి తొలగిపోరు, ఘనతను సాధిస్తారు. మంచిమాటలను తెలిపి మరచి పోకుండా ధ్యానింపజేయాలి.

93. ఆననమునజేరు నర్హమైనదియేను
వాయి నుండి వచ్చుఁపరుషపదము
నోరు మంచిదైన పేరు మహినినందు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! మన నోటిలోకి చేరేది సాధ్యమైనంత వరకు మంచిదై ఉంటుంది. కాని నోటి నుండి మాత్రం చెడ్డ మాటలు వస్తాయి. నోరుమంచిదైతే భూమికూడా వర్థిల్లుతుంది.

94. ఊతి చేతయినుము రాటుగ దేలును
రాగి వలన పసిడి రహినిపొందు
మంచి మాట యిచ్చు మనిషికి గౌరవం
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! ఊయి వలన ఇనుము పదును వస్తుంది. రాగి వలన బంగారం కాంతిని పొందుతుంది. మంచిమాట వలన మనిషికి గౌరవం లభిస్తుంది.

95. జ్ఞానమున్న సుతుడు జనకునకు ముదము
అల్పబుద్ధి జననికంగలార్పు,
పేరు నిలుపు నీవుపరువుదీయక
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! జ్ఞానమున్న కుమారుడు తండ్రికి ఆనందిస్తాడు. బుద్ధిలేని కుమారుడు తల్లికి దు:ఖం కలుగజేస్తాడు. తల్లిదండ్రుల పేరు నిలబెట్టు కాని పరువు తీయకూడదు.

96. నాశనమ్ము నిచ్చు మార్గమాకర్షించు
మేలునిచ్చు దారిమిగుల యిరుకు
కష్టమైన, మంచికార్య మెరిగి జేయి
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! నాశనాన్ని కలిగించే మార్గం చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. మేలును ఇచ్చే దారి చాలా ఇరుకుగా ఉంటుంది. కష్టంగా ఉన్నాసరే మంచిపనినే చేయాలి.

97. పసితనమున మనసు పాపరాహిత్యము,
వృద్ధి చెందుకొద్ది మదిని ఖలము
మలిన రహితమైనమహిని, దివిని పేరు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! పసితనంలో పిల్లల మనస్సులో ఎలాంటి పాపపు ఆలోచనలుండవు. కాని పెరిగేకొద్దీ మనసు కలుషిత మౌతుంది. మనసులో కలుషిత భావాలు తొలగిపోతేనే భూమి మీద, స్వర్గంలోనూ పేరు నిలుస్తుంది.

98. క్షయము నొందు తిండిఁ గరుపగా, నిరతము
కష్టపడుట సబబుగాదు నిజము,
అక్షయమైనదాని నార్జింప శ్రమఁ జూపు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! నశించే స్వభావమున్న తిండిని సంపాదించటానికి అతిగా కష్టపడటం సబబుకాదు. అక్షయమైన మంచి పేరు సంపాదించటానికి కష్టపడాలి.

99. అంతరంగమందు నపరాగముంచుచు
కొండెములను పలుకు కుటిల జనుడు
తగిన సమయమందు తక్కిడి చేయును
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! మనసులో కల్మషాలను ఉంచుకుని అబద్ధాలను పలికే చెడ్డవాడు తగిన సమయం చూసి మోసం చేస్తాడు.

100. కట్టెపుల్ల లేక కార్చిచ్చు రేగదు
నివురు వేడి లేక నిప్పు రాదు
కలహప్రియుడు లేక కలహములాగును
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! కట్టెలు లేకుండా కార్చిచ్చురేగదు. బూడిద వేడిగా లేకుండా ఉంటే నిప్పుపుట్టదు. అదేవిధంగా తంటాల మారి లేకపోతే తగువులు కూడా రావు.

101. కయ్యమొందగాను కాలు దువ్వుట చూడ
జలధి యోర నుబుకు జలము వలెను
వాదు పెరగనపుడె వదలి పోవుట మేలు
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! తగువులకు కాలు దువ్వటం అనేది చూడగా సముద్రం ఒడ్డున ఉబుకు నీటిలాంటిది. కాబట్టి తగవులు పెరగనప్పుడే వారిని విడిచి వెళ్ళటం మేలు.

102. ఊయి బరువు కన్న రాజు నాజ్ఞలకన్న
ఇసుక బరువు కన్నయినుము కన్న
మొండి వానికినుక మోయతగని మోత
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్తాపన కోసం జన్మించిన కుమారా! ఊయి బరువు కంటే, రాజాజ్ఞల కంటే యిసుక బరువుకంటే, యినుముకంటే మొండివాడి కోపం భరించలేనంత బరువు.

103. క్షుత్తు నొందు జనుడు కుడువగ నన్నము
తిక్త వస్తువైన తియ్యగుండుఁ
కడుపు నిండువాడు విడుచు నమృతమైనఁ
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! ఆకలితో ఉన్న వాడు తినడానికి ఏదైనా తిండి దొరికినప్పుడు అది చేదుగా ఉన్నదైనా సరే తీయగా అనిపిస్తుంది. పొట్ట నిండినవాడు అమృతాన్నైనా విడిచిపెడతాడు.

104. మంచితనము జూప నరుడు మేలుని పొందు
చెడుతనమును జూప చెడుయె వచ్చుఁ
నరుడు విత్తునదియె మరల కోయును
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! మంచితనము చూపించే వాడు దాని వలన మేలును పొందుతాడు. చెడు స్వభావం చూపిస్తే చెడే వెంట వస్తుంది. మనిషి ఏమి విత్తుతాడో అదే కోస్తాడు కదా!

105. హద్దెరుగని మాట, ప్రొద్దెరుగని నిద్ర
ఘనత కోరి చేయు దానమున్ను
మారు మనసు లేనిమనిషి భక్తియు వృధా
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! హద్దులు లేకుండా పలికే మాటలు, ప్రొద్దు తెలియకుండా పోయేనిద్ర, ఘనత కోసమని చేసే దానం, మారు మనస్సులేని భక్తి వ్యర్థమే.

106. జారతనము నందు జార నీకు మదిని
వేశ్య తలపులెల్ల వెకిలి చేష్టఁ
ఆశపడితివేని యంతము వచ్చును
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! జారతనము వైపు మనస్సు నిలపకూడదు. వేశ్య ఆలోచనల్లో అన్ని వెకిలిచేష్టలు కనిపిస్తాయి. వాటిపైన ఆసక్తి చూపిస్తే నాశనం వెంటనే వస్తుంది.

107. ఉత్తములగు వారు నుదయించు భానులు
శ్రమల మబ్బులున్న భ్రమలు కారు
అంధకారమయము నధముల మార్గము
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! ఉత్తములనే వారు ఉదయించే సూర్యుడు వంటివారు. శ్రమలనే మబ్బులు అడ్డుగా వచ్చినా భయపడరు. కాని అధముల మార్గం చీకటితో కూడినది.

108. నోరు కలదియట్టి నువిదతో స్వర్ణంబు
మేడ నుండు కంటె,విడచిమూల
సేదనొందుటైన చెల్లును హాయిగా
శాంతినొసగుమయ్య శాంతిపుత్ర

భావం: ప్రపంచ శాంతిస్థాపన కోసం జన్మించిన కుమారా! గయ్యాళి తనంగల భార్యతో బంగారంతో చేయబడిన ఇంటిలో ఉండటం కంటే, విడిచిపెట్టి ఏదో ఒక మూల సేద తీరుతూ ఉంటే అదే గొప్పహాయి.